సాక్షి
ఒడిశా
సోమవారం । 21 । జూలై । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు : రూ. 7,19,515
బంగారం : 220 మిల్లీ గ్రాములు
వెండి : 80 గ్రాములు - భువనేశ్వర్/పూరీ



కళలకు పుట్టినిల్లు ఒడిశా
రాయగడ టాలెంట్ అవార్డు షో ఘనంగా జరిగింది. ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.
- 8లో



నిరసనలకు కళ్లెం
ఎయిమ్స్ బయట నిరసనలకు కళ్లెం వేశారు. ప్రదర్శనలపై నిషేధం విధించారు.
- 8లో

న్యూస్‌రీల్

బీజేడీ దీపారాధన



ఉన్నత చికిత్స కోసం పూరీ జిల్లా బొలొంగా మైనర్ బాలికని ఢిల్లీ ఎయిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ప్రత్యేక వైద్య బృందం ఆమెకి చికిత్స అందజేస్తుంది. ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ బిజూ జనతా దళ్ స్థానిక లింగరాజ ఆలయం ఆవరణలో ఆదివారం సాయంత్రం సామూహిక దీపారాధన నిర్వహించింది. – భువనేశ్వర్

విదేశీ మద్యం బాటిళ్లు స్వాధీనం



విదేశీ మద్యం బాటిళ్లతో నిందితుడు

రాయగడ: జిల్లాలోని మునిగుడ సమితి అంబొదల పోలీసులు శనివారం నిర్వహించిన దాడుల్లో భారీ ఎత్తున విదేశీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అందుకు సంబంధించి ఒకరిని అరెస్టు చేశారు. అక్రమంగా ఇంటిలో విదేశీ మద్యం విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు ఈ దాడులను నిర్వహించారు. నిందితుని ఇంటిలో గల 101.455 లీటర్ల విదేశీ మద్యాన్ని స్వాధీనం చేసుకుని ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు.

హతవిధీ..!



శ్మశాన ప్రాంగణంలో మృతదేహాన్ని తింటున్న శునకాలు

భువనేశ్వర్: కటక్ నగరం కలియాబుదా మహాశ్మశానం ప్రాంగణంలో ఒళ్లు గగుర్పొడిచే సంఘటన వెలుగు చూసింది. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. కాలుతున్న చితి నుంచి మృతదేహం భాగాల్ని చీల్చుకుని కుక్కలు తింటున్న హృదయ విదారక దృశ్యం దిగ్భ్రాంతి కలిగిస్తోంది.

కలపతో లారీ స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కలప లారీ

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ అటవీ ప్రాంతంలో విలువైన చెట్లను నరికి అక్రమంగా కలపను రవాణా చేస్తున్న లారీని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్‌ను అటవీ శాఖ సిబ్బంది అరెస్టు చేశారు. సమితిలోని చంద్రగిరి, సుంగేరి వంటి అటవీ ప్రాంతంలో గతకొద్ది రోజులుగా కలప అక్రమ రవాణా జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు అటవీ శాఖ సిబ్బంది దాడులను నిర్వహించారు. ఈ క్రమంలో సుంగేరు ప్రాంతంలో శనివారం సాయంత్రం అటవీ శాఖ సిబ్బంది వాహన తనిఖీలను చేస్తున్న సమయంలో లారీని ఆపి తనిఖీ చేశారు. అందులో కలప కనిపించింది. అందుకు సంబంధించి ఎటువంటి అనుమతులు లేకపోవడంతోపాటు కలపను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించిన సిబ్బంది లారీని, లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేశారు. అటవీ శాఖ సిబ్బంది సునీల్ స్వయి, మోనొస్మిత పాణిగ్రాహి, ఘాసీ మాఝి, మిన కుమారి దాడులు నిర్వహించిన వారిలో ఉన్నారు.

దద్దరిల్లుతున్న బొలొంగా



బొలొంగా పోలీసు ఠాణా ముట్టడించిన బీజేడీ వర్గీయులు



ఘటనా స్థలంలో వైజ్ఞానిక నిపుణుల బృందం పరిశీలన



హోరెత్తుతున్న బొలొంగా గ్రామం

భువనేశ్వర్: పూరీ జిల్లాలో బాలికకు నిప్పు అంటించిన సంఘటనలో పోలీసులకు ఇంత వరకు ఎలాంటి ఆధారం లభించక తల్లడిల్లుతున్నారు. ఈ నిస్సహాయ పరిస్థితి ఆధారంగా విపక్ష బిజూ జనతా దళ్ ఆందోళనలతో విజృంభించింది. ఆదివారం బొలొంగా గ్రామం అటు దర్యాప్తు బృందాల సందర్శన, ఇటు విపక్షం ఆందోళనల హోరు మధ్య బిక్కు బిక్కుమంటున్నారు.

మరో 24 గంటల్లో ఆగంతకుల ఆచూకీ గుర్తించ లేకుంటే వీధికి ఎక్కుతామని విపక్ష బిజూ జనతా దళ్ అటు ప్రభుత్వానికి, ఇటు పోలీసులకు బాహాటంగా హెచ్చరించింది. ప్రభుత్వం పెదవి కదపకుండా పరిస్థితిని లోతుగా సమీక్షిస్తోంది. ఈ నేపథ్యంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ బాధ్యతలు వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిదా నైతికత దృష్ట్యా పదవికి రాజీనామా చేయాలని ఆందోళనకారులు ఒత్తిడి తెస్తున్నారు. పోలీసు భద్రత మధ్య ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి అనుక్షణం తాజా పరిణామాల పట్ల దృష్టి సారించారు.

కొనసాగుతున్న విచారణ

ఈ సంఘటనపై విచారణ నిరవధికంగా కొనసాగిస్తున్నారు. సందిగ్ధ వ్యక్తుల్ని పదే పదే ప్రశ్నిస్తున్నారు. శనివారం రాత్రి తొలి దశలో 8 మంది వ్యక్తుల్ని అదుపులోకి తీసుకుని ప్రశ్నించిన మేరకు విడుదల చేశారు. తిరిగి ఆదివారం ఉదయం వీరందర్ని ఠాణాకు రప్పించి విచారణ కొనసాగించారు. వీరిలో బాధిత బాలిక బంధువులు ఉన్నట్లు సమాచారం. అయితే ఆధారాలు, సాక్ష్యాలకు సంబంధించి ధ్రువీకరణ దృఢపడక పోవడంతో ఇంత వరకు అరెస్టుల ఘట్టం ఆరంభం కాలేదు. ఈ తటస్థ వైఖరి పట్ల విపక్ష బిజూ జనతా దళ్ తీవ్రంగా ప్రతిస్పందిస్తుంది. బొలంగా పోలీసు ఠాణా ముట్టడించి మరో 24 గంటల్లోగా నిందితుల్ని గుర్తించి అరెస్టు చేయకుంటే జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన ఉద్ధృతం చేస్తామని ఆదివారం స్పష్టం చేసింది. బొలొంగాలో పరిస్థితి ఉద్రిక్తంగా కొనసాగుతుంది.



బొలొంగా గ్రామంలో బిజూ జనతా దళ్ ఆందోళన

ఘటనా స్థలంలో డీజీపీ

బాలికకు నిప్పు అంటించిన సంఘటనలో ఆధారాల అన్వేషణలో సమగ్ర పోలీసు యంత్రాంగం తలమునకలై ఉంది. వైజ్ఞానిక నిపుణుల బృందం సహకారం తీసుకుంటుంది. పోలీసు వర్గాలతో వైజ్ఞానిక, సాంకేతిక నిపుణుల వర్గాలు ఘటనా స్థలం తరచు సందర్శించి నిర్వహిస్తున్న పరిశీలనలో ఇంత వరకు బలమైన ఆధారాలు లభ్యం కానట్లు సమాచారం. రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ యోగేష్ బహదూర్ ఖురానియా ప్రత్యక్షంగా ఆదివారం ఘటనా స్థలం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రముఖమైన సాక్షులుగా భావిస్తున్న వారితో ఆయన ముఖాముఖీ సంభాషించారు. పూరీ జిల్లా పోలీసు సూపరింటెండెంటు పినాక్ మిశ్రా ఆయనతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ విచారకర సంఘటనకు సంబంధించి కొంత వరకు సమాచారం లభించినట్లు డీజీపీ తెలిపారు. ఈ సంఘటనపై దర్యాప్తు బలంగా కొనసాగుతుందన్నారు. బలమైన సాక్ష్యాధారాల కోసం నేడు 10 మంది సభ్యులతో కూడిన రెండు వైజ్ఞానిక, సాంకేతిక ప్రత్యేక బృందాలు ఘటనా స్థలంలో పరిసరాలు సందర్శించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ఫోరెన్సిక్ సైన్సు లేబొరేటరి మరియు ఎయిమ్స్ ఫోరెన్సిక్ బృందాలు ఆధారాల సేకరణ కోసం ఘటనా స్థలం వేర్వేరుగా సందర్శించినట్లు వివరించారు. వీరి పరిశీలనలో కొంత మేరకు సమాచారం అందినట్లు ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.



బాలికకు తొలి రక్షణ కల్పించిన గ్రామస్తునితో డీజీపీ మాటామంతీ



బాలికకు నిప్పు అంటించిన ప్రాంతంలో డీజీపీ ప్రత్యక్ష పర్యవేక్షణ

• నేడు సువర్ణ చక్ర పరిక్రమ

పవిత్ర శ్రావణ మాసం కృష్ణ పక్షం ఏకాదశి తిథి పురస్కరించుకుని సోమవారం సువర్ణ సుదర్శన చక్ర పరిక్రమ సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తారు. శ్రీ మందిరంలో మధ్యాహ్నం ధూపం ముగిసిన తర్వాత జగన్నాథుని ఆజ్ఞతో బంగారు శ్రీసుదర్శన చక్రాన్ని నగర పరిక్రమ నిర్వహిస్తారు. శ్రీక్షేత్ర వాసులకు ఇదో అపురూప దర్శన భాగ్యంగా భావిస్తారు. – భువనేశ్వర్



• ఘోర రోడ్డు ప్రమాదం



ప్రమాదానికి గురైన కారును తొలగిస్తున్న దృశ్యం

- ఎదురెదురుగా ఢీకొన్న కార్లు
- ముగ్గురు దుర్మరణం
- మరో ఇద్దరి పరిస్థితి విషమం

కొరాపుట్: ఎదురెదురుగా కార్లు ఢీకొన్న ఘటనలో ముగ్గురు యువకులు మృతి చెందగా..మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘోర ప్రమాదం ఆదివారం వేకువజామున కొరాపుట్ జిల్లా సునాబెడా–కొరాపుట్ పట్టణాల మధ్య 26వ నంబర్ జాతీయ రహదారిపై సునాబెడా టీటీఎస్ గేటు ఎదురుగా ఈ ఘటన జరిగింది. ఒక కారులో నలుగురు స్నేహితులు సిమిలిగుడ నుంచి సునాబెడా వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఎదురుగా వచ్చిన మరో కారును ఢీకొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఒక కారులో ఉన్న సునాబెడా ఈఎఫ్ కాలనీకి చెందిన మాళీ క్రిష్ణ రణా కొడుకు అశుతోష్ రణా (24) అక్కడిక్కడే మృతి చెందాడు. సునాబెడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను కొరాపుట్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాహిద్ లక్ష్మణ్ నాయక్ వైద్య కళాశాలకు తరలించారు. అక్కడ సునాబెడా డీపీ క్యాంపునకు చెందిన లింగ రాజ్ ప్రాతో కుమారుడు వికాష్ కుమార్ పాత్రో (25), గంజాం కాలనీకి చెందిన మోహన్ హరిజన కుమారుడు కైలాష్ హరిజన్ (30)లు ప్రాణాలు విడిచారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని విశాఖపట్నం తరలించారు. సబ్ ఇన్‌స్పెక్టర్ చరణ్ సింగ్ మజ్జి కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మజ్జి తీవ్ర సంతాపం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ. నాలుగు లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. క్షతగాత్రులు ఇద్దరికి వైద్య ఖర్చులు మెత్తం ప్రభుత్వం భరిస్తుందని ప్రకటించారు.



బోల్తాపడిన కారు



ప్రమాదంలో నుజ్జయిన మరో కారు

అత్యాచారం కేసులో ఒకరి అరెస్టు

రాయగడ: అత్యాచారం కేసులో ఒకరిని సదరు పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. అరెస్టయిన వ్యక్తి అగ్నిమాపకశాఖ అదనపు అధికారి రమేష్ చంద్ర బెహరగా గుర్తించారు. తనపై రమేష్ చంద్ర బెహర అత్యాచారానికి పాల్పడినట్టు ఓ మహిళ చేసిన ఫిర్యాదు అతన్ని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. సదరు పోలీస్ స్టేషన్ ఐఐసీ ప్రసన్న కుమార్ బెహర తెలియజేసిన వివారల ప్రకారం.. గత రెండు సంవత్సరాలుగా ఒక వివాహితతో రమేష్ చంద్ర బెహర అక్రమ సంబంధం పెట్టుకున్నట్లు తన దర్యాప్తులో తేలిందన్నారు. అక్రమ సంబంధాన్ని ఆసరగా తీసుకుని ఆమెను రమేష్ చంద్ర బెహర వేధిస్తుండేవాడని ఆమె చేసిన ఫిర్యాదులో పేర్కొనడంతో అతన్ని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

లైంగికదాడి కేసులో నిందితుడి అరెస్టు

జయపురం: ఒక బాలికపై లైంగిక దాడి చేశాడనే ఆరోపణపై యువకుడిని అరెస్టు చేసినట్లు జయపురం మహిళా పోలీసు అధికారి ఆశ్రిత ఖల్కో ఆదివారం వెల్లడించారు. అరెస్టయిన నిందితుడు బొయిపరిగుడ సమితి బురుడుపుయి గ్రామం గురు మచ్చ (21) అని వెల్లడించారు. అతడిని కోర్టుకు పంపించామని తెలిపారు. తన తాతగారిలో ఊరిలో బాలికపై లైంగికదాడికి పాల్పడినట్లు ఫిర్యాదు రావడంతో దర్యాప్తు చేసి అతడిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలు విచ్ఛిన్నం: సస్మిత్ పాత్రో

భువనేశ్వర్: భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం హయాంలో ఒడిశాలో శాంతిభద్రతల విచ్ఛిన్నమై నిత్యం ఆందోళనకర పరిస్థితులు తాండవిస్తున్నాయి. ఈ విషయాన్ని భారత పార్లమెంటు వర్షాకాలం సమావేశాల్లో లేవనెత్తనున్నట్లు బిజూ జనతా దళ్ జాతీయ అధికార ప్రతినిధి, రాజ్య సభ సభ్యుడు డాక్టరు సస్మిత్ పాత్రో తెలిపారు. మహిళలు, పిల్లలపై దారుణమైన నేరాలు పెచ్చుమీరుతున్నాయి. బాలాసోర్‌లో ఒక విద్యార్థి విషాదకరంగా ఆత్మాహుతికి పాల్పడి ప్రాణాలు కోల్పోయింది. ఈ విషాదం నుంచి కోలుకోక ముందే పూరీ జిల్లాలో మరో మైనరు బాలికకు నిప్పు అంటించి ఆగంతకులు అలజడి రేపారు. ఆమె ప్రాణాపాయ పరిస్థితుల్లో మృత్యు పోరాటం చేస్తుంది. బాలాసోర్‌లో ఆత్మాహుతికి పాల్పడిన విద్యార్థిని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ సభ్యురాలు, అయినప్పటికీ ఆమె విన్నపాలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం అత్యంత విచారకరం. ఆత్మాహుతికి ముందు ఆమె స్థానిక భారతీయ జనతా పార్టీ పార్లమెంటు సభ్యుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులు, జాతీయ మహిళా కమిషను (ఎన్‌సీడబ్ల్యూ), అనేక మంది బీజేపీ నాయకులకు ట్వీట్ చేసిన ఏ ఒక్కరు సకాలంలో స్పందించకపోవడంతో జరగరాని విషాదం జరిగిపోయింది. దాదాపు 20 రోజుల క్రితం భువనేశ్వర్ నగర పాలక సంస్థ బీఎంసీ అదనపు కమిషనర్‌పై ఆయన కార్యాలయంలో 5 మంది స్థానిక భారతీయ జనతా పార్టీ నాయకులు అవమానకరంగా దాడి చేసి ప్రాణాపాయ స్థితిలో అలజడి రేపారు. పూరీ శ్రీ జగన్నాథుని రథ యాత్ర తొక్కిసలాట సందర్భంగా భక్తులు ప్రాణాలు కోల్పోయిన విషాదకర సంఘటన పాలన వ్యవస్థ బలహీనతకు తార్కాణంగా పార్లమెంటులో ప్రస్తావించి సముచిత చర్యల కోసం అభ్యర్థించనున్నట్లు డాక్టరు సస్మిత్ పాత్రో తెలిపారు.

• అపచారం





జగన్నాథ్ వల్లభ్ సముదాయం సెల్లార్ పార్కింగులో మరుగున పడి ఉన్న శ్రీ జగన్నాథుని ప్రతిమలు

భువనేశ్వర్: శ్రీ మందిరం ప్రాకారంలో భాగంగా జగతి నాథుని వివిధ అలంకారాల శోభిత ప్రతిమల్ని సమగ్ర ఎయిర్ కండిషన్ జగన్నాథ్ వల్లభ్ సముదాయంలో అత్యంత అట్టహాసంగా ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టు ప్రారంభోత్సవం పురస్కరించుకుని భక్తులు, యాత్రికుల మనోభావాల్ని దృష్టిలో పెట్టుకుని ఈ భారీ ఏర్పాటు చేసింది. ఏడాది పొడవునా పలు పండగలు, ఉత్సవాలు, యాత్రలు సందర్భంగా స్వామి వివిధ రూపాల అలంకరణతో ఈ నమూనా మూర్తుల్ని ఎయిర్ కండిషన్ సముదాయంలో సందర్శకుల కోసం ప్రదర్శించారు. ఒకే చోట ఆరాధ్య దైవం వివిధ అపురూప అలంకరణ శోభతో తిలకించే భాగ్యం పట్ల అశేష భక్త, యాత్రికుల జనం సంతోషం వ్యక్తం చేసింది. పాలకులు మారడంతో తీరు మారింది. పవిత్రమైన జగతి నాథునితో అన్నా చెల్లెలు బలభద్ర స్వామి, దేవీ సుభద్ర ప్రతిమలు మరుగున పడ్డాయి. జగన్నాథ్ వల్లభ్ సముదాయం సెల్లార్ వాహన పార్కింగులో మూటలు గట్టి ఈ పవిత్ర ప్రతిమల్ని మరుగున పడేశారు. ఈ తీరు పట్ల సర్వత్రా విచారం వ్యక్తం అవుతుంది. స్వామి 25 రకాల అలంకరణతో యాత్రికులకు అలరించిన నమూనా ప్రతిమలు నేడు ఇలా మరుగున పడడం అత్యంత విచారకరం. వీటిలో అత్యంత అరుదైన రఘునాథ అలంకరణ నమూనా కూడ మూటలో ముడి పడి పోయింది. ప్రత్యక్షంగా స్వామి అలంకరణని తిలకించే భాగ్యం లేని అపురూప రూపాలు ఈ ప్రదర్శనలో చోటు చేసుకున్నాయి. ప్రభుత్వం, శ్రీ మందిరం యాజమాన్య యంత్రాంగం నిర్లక్ష్యపు చర్యలతో ఇలా అపవిత్రత మధ్య మగ్గిపోతున్నాయి.

• బోల్‌భం భక్తుల సేవలో..



భక్తులకు అల్పాహారం పంపిణీ చేస్తున్న దృశ్యం



కాళ్లకి స్ప్రే కొడుతున్న సేవకులు

కొరాపుట్: బోల్‌భం భక్తులకు సేవలు అందించడానికి అనేక మంది స్వచ్ఛందంగా తరలి వచ్చారు. ఆదివారం శ్రావణ మాస బోల్‌భం భక్తులు కొరాపుట్ జిల్లా బొయిపరిగుడ సమితి దండకారణ్యంలోని సహజ సిద్ధపుణ్య క్షేత్రం దర్శించడానికి వేలాదిగా తరలివచ్చారు. పాత్రోపుట్ వద్ద బ్రిటిష్ వంతెన కింద నుంచి పవిత్ర జలంతో కావిడి యాత్రలు ప్రారంభించారు. ఈ పాద యాత్ర 50 కిలోమీటర్లు సాగిస్తారు. వీరందరికీ మార్గమధ్యంలో అనేక ఉచిత సదుపాయలు కల్పించడానికి ప్రజలు, సామాజిక సేవా సంస్థలు తరలి వచ్చాయి. వేల సంఖ్యలో భక్తులు నడుస్తుండడంతో దండకారణ్యం కాషాయ మయంగా మారింది. ప్రతి చోట ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు టిఫీన్లు, మధ్యాహ్నం భోజనాలు ఏర్పాటు చేశారు. దారి పొడుగునా పళ్లు, గ్లూ కోజ్ ప్యాకెట్లు, టీ, బిస్కెట్లు, మంచినీటిని అందజేస్తున్నారు. ఒకరితో మరొకరికి సంబంధం లేకుండా అనేక మంది ప్రజలు స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలు చేశారు. మరికొందరు యువకులు భక్తులకు పాద మర్దనం చేసి మందులు అందిస్తున్నారు. ఆదివారం రాత్రికి గుప్తేశ్వరం చేరుకున్న భక్తులు సోమవారం తాము తెచ్చిన పవిత్ర జలంతో గుప్తేశ్వర స్వామివారికి అభిషేకం చేయనున్నారు.



నడుస్తున్న బోల్‌భం యువతికి పళ్లు అందజేస్తున్న సేవకులు

30 కిలోల గంజాయి పట్టివేత

• ఒకరి అరెస్టు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా బలిమెల పోలీస్‌స్టేషన్ పరిధి తాటిగూడ గ్రామం వద్ద శనివారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న బలిమెల పోలీసులు అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి విచారించగా అతని వద్ద గంజాయి పట్టుబడింది. 30 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని అతన్ని అరెస్టు చేశారు. అరెస్టయిన వ్యక్తి తాటిగూడ గ్రామానికి చెందిన రామ్ మడ్కమిగా గుర్తించారు. చిత్రకొండ సమితిలో గంజాయిని కొనుగోలు చేసి బలిమెలకు తరలిస్తూ పట్టుబడినట్టు పోలీసులు పేర్కొన్నారు. నిందితుడిని సోమవారం కోర్టులో హాజరు పరుస్తామని ఐఐసీ దీరాజ్ పట్నాయక్ తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ. రెండు లక్షలు ఉంటుందని చెప్పారు.



అరెస్టయిన నిందితుడితో పోలీసులు

క్లుప్తంగా

జోరువానలో పనులా?



వర్షంలోనే పనులు నిర్వహిస్తున్న దృశ్యం

రణస్థలం: రణస్థలంలో జరుగుతున్న ఫ్లై ఓవర్ పనుల్లో భాగంగా ఆదివారం ఓవైపు జోరుగా వర్షం పడుతున్నా పనులు కొనసాగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి పరిస్థితిలో పనులు చేస్తే నాణ్యత లోపించి కాలువలు ఎక్కువ కాలం మన్నిక రాదని స్థానికులు చెబుతున్నారు. హైవే అధికారులు స్పందించి నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

8 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

ఎచ్చెర్ల : ఎస్ఎంపురం గ్రామ సమీపంలోని తోటల్లో పేకాట ఆడుతున్న 8 మందిని ఎచ్చెర్ల పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.21,130 నగదు, 7 సెల్‌ఫోన్లు, 3 ద్విచక్ర వాహనాలు, కారు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై-2 ఎం.అప్పలరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మోహన్ ఆచార్య, సోమనాథ్‌ను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

మందస: మందస మండల కేంద్రంలో శ్రీరాజా శ్రీనివాస స్మారక ఉన్నత పాఠశాల 125వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. అన్ని బ్యాచ్‌లకు చెందిన పూర్వ విద్యార్థులు హాజరై ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. తోటి స్నేహితులను కలుసుకుని సందడి చేశారు. ఐకానిక్ భవన నిర్మాణంలో కీలకపాత్ర పోషించిన మోహన్ ఆచార్యను సన్మానించారు. ప్రతి బ్యాచ్‌కు ప్రత్యేక షీల్డ్‌ను అందజేశారు.

విశ్రాంత డీఈఈ మృతికి సంతాపం



జి.సిగడాం: గతంలో వంశధార ప్రాజెక్టులో డీఈఈగా పని చేసి ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన సువ్వారి జగదేశ్వరరావు(62) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. ఈయన జి.సిగడాం మండలం వాండ్రంగి షిరిడీసాయి అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నారు. నీటిపారుదల శాఖలో ఏఈఈగా పని చేసిన అనంతరం వంశధార ప్రాజెక్టులో డీఈఈగా విధులు నిర్వహించి బదిలీపై పాయకరావుపేట వెళ్లారు. అక్కడ పని చేసి మార్చి 31న పదవీ విరమణ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఈలు డోల తిరుమలరావు, రవీంద్ర, మురళీకృష్ణ, వెంకటేశ్వరావు, సీఐ సింహాద్రినాయుడు, డీఈఈలు మన్మధరావు, రామ్మోహన్ , ఏఈఈలు, ప్రజాప్రతినిధులు బూరాడ వెంకటరమణ, సాకేటి నాగరాజు, కర్రి వైకుంఠేశ్వరరావు, గంటా అప్పారావు, రంగారావు, చిట్టిరి మోహన్‌లు నివాళులు అర్పించారు. వాండ్రంగిలో సోమవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె



నిరసన తెలియజేస్తున్న మున్సిపల్ కార్మికులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శ్రీకాకుళం కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఐదో రోజైన ఆదివారం సమ్మె కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, ఇంజినీరింగ్ కార్మికులు, పారిశుద్ధ్య కార్మికులకు జీవో 36 ప్రకారం రూ.26 వేలు వేతనాలు ఇవ్వాలని, కార్మికులందరికీ తల్లికి వందనం, ఫీజు రీయంబర్స్‌మెంట్ అమలు చేయాలని, రేషన్ కార్డులు తదితర సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ -ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు అరుగుల గణేష్, ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం, ఎ.శంకర్, యుగంధర్, ఎ.శేఖర్, ఎ.రాజశేఖర్, ఎ.జనా, డి.గణేష్, ఎ.లక్ష్మి, ఎన్.పార్వతి, ఆర్.ఈశ్వరమ్మ, ధనలక్ష్మి, పి.మల్లమ్మ, కె.బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

లారీ క్యాబిన్‌లో ఇరుక్కుని డ్రైవర్ మృతి

కాశీబుగ్గ: కోళ్లవ్యాన్‌ను అతివేగంతో వచ్చిన లారీ ఢీకొట్టడంతో డ్రైవర్ మృతిచెందిన ఘటన పలాస సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. పలాస మండలం గోదారిపురం గ్రామానికి చెందిన ఆసపాన దయాకర్ క్లీనర్‌తో కలిసి కోళ్ల వ్యాన్‌తో వెళ్తుండగా కోసంగిపురం-మొగిలిపాడు గ్రామాల మధ్య కటక్ నుంచి విశాఖపట్నం వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్ సుశాంత్ నాయక్ (35) క్యాబిన్‌లో ఇరుక్కుని అక్కడికక్కడే మరణించాడు. కోళ్లవ్యాన్ డ్రైవర్, క్లీనర్లు స్వల్పగాయాలతో బయటపడ్డారు. కాశీబుగ్గ ఎస్సై చంద్రరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కళలకు పుట్టినిల్లు ఒడిశా



అలరించిన ఒడిస్సీ నృత్యప్రదర్శన



ప్రసంగిస్తున్న మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ గొమాంగో

- మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ గిరిధర్ గొమాంగో

రాయగడ: భిన్న సంస్కృతులతో భాషిల్లుతున్న మన రాష్ట్రం కళలకు పుట్టినిల్లని మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ గిరిధర్ గొమాంగో అన్నారు. స్థానిక బిజు పట్నాయక్ ఆడిటోరియంలో ఆదివారం మా మజ్జిగౌరి ఎంటర్‌టైన్మెంట్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన రాయగడ టాలెంట్ అవార్డు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కళాకారులనుద్దేశించి ప్రసంగించారు. రాష్ట్రానికి చెందిన ఎంతో మంది కళాకారులు దేశ, విదేశాల్లో తమ ప్రతిభను చాటుకుని ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. ప్రముఖ గాయకుడు రఘునాథ్ పాణిగ్రాహి అనేక తెలుగు చలన చిత్రాల్లో తన మధురమైన స్వరంతో పాటలు పాడి అందరినీ మైమరపించారని గుర్తు చేశారు. ఎంతో మంది కళామతల్లిని నమ్ముకుని ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కళాకారులను, కళలను ప్రోత్సాహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కళారంగంలో వారు రాణించగలిగితే రాష్ట్రం కళారంగంలో మరో మైలు రాయి చేరుకునే అవకాశం ఉంటుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కళారంగాన్ని నమ్ముకుని ఉన్న ఎంతో మంది సీనియర్ కళాకారులు నేడు అత్యంత దయనీయమైన స్థితిలో ఉన్నారన్నారు. అటువంటి వారిని గుర్తించి ప్రభుత్వం వారిని ఆదుకోవడంతోపాటు నెల వారి పింఛన్‌ను అందివ్వాలన్నారు. డు యువ కళాకారులు వారి ప్రతిభను చాటి అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకుంటున్నారన్నారు.

ఇటువంటి తరహా ప్రోత్సాహం అవసరం..

కళాకారులను గుర్తించి వారికి ఆయా రంగంలో ప్రోత్సాహించడంతోపాటు వారికి కళలపై మరింత మక్కువ కలిగేలా మా మజ్జిగౌరి ఎంటర్‌టైన్మెంట్ ట్రస్టును రాయగడలో ఏర్పాటు చేయడం ఆ ట్రస్టు ద్వారా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన రాయగడ ఎమ్మెల్యే అప్పల స్వామి కద్రక అన్నారు. ప్రతీ కళాకారునికి చేయూతనందించే ఇటువంటి తరహా సంస్థలు మరిన్ని ముందుకు రావాలని ఆకాంక్షించారు. ట్రస్టు అధ్యక్షుడు బొచ్చా సంతోష్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బిజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి ఆనంద్, యాల్ల కొండబాబు, భువనేశ్వర్‌కు చెందిన ఒడిశా కళాక్షేత్రం కార్యదర్శి బాసుదేవ్, అఖిల ఒడిశా స్వచ్ఛ సేవా మహాసంఘం కార్యదర్శి సుజాత తదితరులు ప్రసంగించారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన కళాకారులకు ఈ సందర్భంగా సన్మానించారు. జిల్లా నుంచి వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన సాంస్కృతిక నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి.



కార్యక్రమానికి హాజరైన కళాకారులు, కళాభిమానులు



యువ కళాకారులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే కద్రక

శాకంబరిగా లలితాదేవి



శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని మొండేటివీధిలో లలితా సమేత శివ కామేశ్వరస్వామి దేవాలయంలో ఆషాఢ మాసం సందర్భంగా లలితాదేవిని ఆదివారం శాకంబరిగా అలంకరించారు. షిరిడీసాయి సేవా సంఘం, అర్చకులు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

వైభవంగా కావడి ఉత్సవం

శ్రీకాకుళం కల్చరల్ : సుబ్రహ్మణ్య స్వామి ఆడీకృత్తిక మహోత్సవం సందర్భంగా ఆదివారం నక్కవీధిలోని ఉమాజఠలేశ్వరస్వామి ఆలయంలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. గుడివీధిలో నాగావళి నదీ తీరంలో గంగా, యమునా, సరస్వతీ మాతృకా మందిరం వద్ద సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో కావడి ఉత్సవం నిర్వహించారు. పండితులు భాస్కరభట్ల శ్రీరామశర్మ నేతృత్వంలో అర్చకులు పెంట శ్రీనివాసశర్మ, కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో ఊరేగింపు చేపట్టారు. అయ్యప్పస్వామి దేవాలయంలో స్వామివాకి ప్రత్యేక అభిషేకాలు జరిగాయి.

కొండలరావు నేత్రాలు సజీవం



శ్రీకాకుళమ కల్చరల్: నగరంలోని ఏపీహెచ్‌బీ కాలనీలో నివాసం ఉంటున్న వడ్డి కొండలరావు(70) అనారోగ్య కారణంగా మృతి చెందారు. మరణానంతరం ఆయన నేత్రాలు ఇతరులకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో కుమారుడు వడ్డి పశుపతినాథ్, పిల్ల వైకుంఠరావులు శిల్లా మణికంఠ ద్వారా విషయం రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుకు తెలియజేశారు. మగటపల్లి కల్యాణ్ నేత్రసేకరణ కేంద్రం టెక్నికల్ ఇన్‌చార్జి సుజాత, నంది ఉమాశంకర్‌ల ద్వారా కార్నియాలను సేకరించి విశాఖలోని ఎల్‌వీప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందచేశారు. దాత కుటుంబ సభ్యులను రెడ్‌క్రాస్ ప్రతినిధులు అభినందించారు. నేత్రదానం చేయాలనుకునేవారు 7842699321 నంబరుకు సంప్రదించాలని కోరారు.

బీజేపీ జిల్లా కమిటీ నియామకం

శ్రీకాకుళం న్యూకాలనీ: భారతీయ జనతా పార్టీ శ్రీకాకుళం జిల్లాశాఖ నూతన కార్యవర్గం నియామకమైంది. ఈ మేరకు ఆదివారం జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు జాబితా వెల్లడించేశారు. ఉపాధ్యక్షులుగా పాలవలస వైకుంఠరావు (పలాస), వెల్పుల గోవిందరావు (ఆమదాలవలస), మంగి లక్ష్మిరెడ్డి (ఇచ్ఛాపురం), లెంక అప్పలనాయుడు (ఎచ్చెర్ల), తాడేల భూపతి (పాతపట్నం), నడుపూరి లక్ష్మినారాయణ (టెక్కలి), భైరి అప్పారావు (శ్రీకాకుళం), నారాయణశెట్టి కల్పన (ఎచ్చెర్ల), ప్రధాన కార్యదర్శులుగా చింతు పాపారావు (నరసన్నపేట), పేడాడ సూరపునాయుడు (ఆమదాలవలస), కోశాధికారిగా వీకె ప్రసాద్ (ఇచ్ఛాపురం), సహాయక కార్యదర్శులుగా వి.రఘురాములు, బి.రాజేశ్వరి, కె.దమయంతి, పి.చంద్రావతి, పి.కావ్య, పి.సూర్యనారాయణ, బి.వంశీ, జె.కుమారి. జిల్లా ఐటీసెల్ కన్వీనర్‌గా రావాడ పురుషోత్తం, జిల్లా సోషల్‌మీడియా కన్వీనర్ బడే తాతారావును నియమించారు. కాగా, పార్టీలో క్రియాశీలంగా వ్యవహరించిన సీనియర్ నాయకులను విస్మరించడం పట్ల అనేకమంది పెదవివిరుస్తున్నారు.

ఆదిత్యుని సన్నిధిలో భక్తజనం



ఆలయం ముందు దర్శనాలకు వెళ్తున్న భక్తులు



సూర్యనమస్కారాల పూజలు చేయించుకుంటున్న భక్తులు

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కేశఖండనశాలలో తలనీలాలను సమర్పించుకునేందుకు బారులు తీరారు. రావిచెట్టు, ఇంద్ర పుష్కరిణి వద్ద ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ఈవో కె.ఎన్.వి.డి.వి.ప్రసాద్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దర్శనాల మార్గాల్లో కూడా ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. అంతరాలయంలో మూలవిరాట్టుకు ప్రత్యేక అలంకరణ చేసి ఉదయం 6 గంటల నుంచే సర్వదర్శనాలు జరిగేలా ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ చర్యలు చేపట్టారు. పలువురు జిల్లా అధికారులు, న్యాయమూర్తులు కుటుంబాలతో సహా ఆదిత్యున్ని దర్శించుకున్నారు. ఆలయ సూపరింటెండెంట్ వెంకటరమణ తదితరులు ప్రొటోకాల్ దర్శనాలు చేయించారు.

రూ.158 కోట్లతో అభివృద్ధి



నబరంగ్‌పూర్ జిల్లా పపడాహండిలో స్మారక స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కొరాపుట్: రాష్ట్ర పంచాయతీ రాజ్, తాగునీటి, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి రబి నాయక్ రూ.158 కోట్లతో పలు అభివృద్ధి పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. నబరంగ్‌పూర్ జిల్లాలో మంత్రి పర్యటించారు. పపడాహండిలో స్వాతంత్ర్య సమర యోధుల స్మారక స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం జిల్లా కేంద్రంలో అన్ని విభాగాల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రూ.18.28 కోట్లతో జల జీవన్ మిషన్ తాగు నీటి సరఫరా ప్రాజెక్ట్, గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా రూ.62.64 కోట్ల విలువ గల 12 ప్రాజెక్ట్‌లు, మిషన్ శక్తి ద్వారా రూ.15 కోట్లతో 50 గ్రామ పంచాయతీలలో మహా సంఘ భవనాలు, 109 అంగన్‌వాడీ భవనాలకు శంకుస్థాపన చేశారు. జిల్లాకి చెందిన ప్రాథమిక విద్య, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నిత్యానంద గోండో, ఎమ్మెల్యేలు గౌరీ శంకర్ మజ్జి, నర్సింగ్ బోత్ర, కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో, తదితరులు పాల్గొన్నారు.

286 మందికి వైద్య పరీక్షలు

కొరాపుట్: ఆంధ్ర-ఒడిశా వివాదస్పద ప్రాంతం కొఠియాలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. కొరాపుట్ జిల్లా పొట్టంగి సమితి కొఠియా గ్రామ పంచాయతీ నేరడివలస గ్రామంలో ఒడిశా ప్రభుత్వం తరపున ఈ శిబిరం ఏర్పాటు చేశారు. 286 మందికి వైద్య పరీక్షలు చేపట్టారు. 31 మందికి కళ్లద్దాలు ఉచితంగా పంపిణీ చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. పొట్టంగి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అధికారి డాక్టర్ భగవత్ ముర్ము, గైనకాలజిస్ట్ సంతోష్ కుమార్ పండా సేవలు అందజేశారు. ప్రభుత్వ అధికారులు ఈ శిబిరానికి అవసరమైన ఏర్పాట్లు చేశారు.

ఎయిమ్స్ వెలుపల నిరసనలకు కళ్లెం



ఎయిమ్స్ ఆవరణలో రాజకీయ వర్గాల ఆందోళన



ఎయిమ్స్ ఆవరణలో నిరసనల ప్రదర్శన నిషేధం ప్రకటించిన కమిషనరేటు పోలీసులు

భువనేశ్వర్: పూరీ జిల్లా బొలొంగా ప్రాంతపు బాలిక చికిత్స నేపథ్యంలో స్థానిక అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ ఎయిమ్స్ ప్రాంగణంలో రాజకీయ వర్గాల నినాదాలతో మారు మోగుతోంది. శనివారం రాత్రంతా ఇదే పరిస్థితి కొనసాగడంతో రాత్రికి రాత్రి భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) 163 సెక్షన్ అమలు చేసినట్లు ప్రకటించారు. ఈ నిబంధన కింద ఎయిమ్స్ భువనేశ్వర్‌లోని బర్న్ వార్డు చుట్టుపక్కల ప్రాంతాన్ని నిషేధిత జోనుగా పరిగణించడం జరుగుతుందని నగర డీసీపీ జగ్మోహన్ మీనా తెలిపారు. పూరీ జిల్లా బొలంగా ప్రాంతంలో జరిగిన దారుణమైన దాడిలో 15 ఏళ్ల కాలిన బాధిత బాలిక తీవ్ర చికిత్స పొందుతున్న ఆస్పత్రి సమీపంలో భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్, బిజూ జనతా దళ్ కార్యకర్తలు శనివారం రాత్రి ఘర్షణ పడిన తర్వాత ఈ చర్య తీసుకున్నారు. సాయంత్రం రాజకీయ కార్యకర్తలు ఆస్పత్రి వెలుపల నిరసన తెలిపి న్యాయం చేయాలని డిమాండ్ చేయడంతో పరిస్థితి తీవ్ర ఘర్షణకు దారితీసింది. పోలీసులు లౌడ్ స్పీకర్లతో హెచ్చరికలు జారీ చేసి, అంతరాయం కలగకుండా, ఇన్ఫెక్షన్ ప్రమాదం నివారణకు ఆసుపత్రి ప్రాంగణం నుంచి నిరసనకారులను తొలగించడం ప్రారంభించారు.

శాంతిభద్రతలను కాపాడటానికి 3 ప్లాటూన్ల పోలీసులను మోహరించారు. ఆస్పత్రి ప్రవేశ, లాబీ ప్రాంతాల దగ్గర గుమిగూడకుండా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బీఎన్ఎస్ 163 అమలు అనధికార సమావేశాలను నిషేధిస్తుంది. అధికారులు ఎయిమ్స్ భువనేశ్వర్ ప్రాంగణాన్ని నిషేధిత ప్రాంతంగా ప్రకటించారు. తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యేంత వరకు నిరసనలను నిషేధం అమలు నిరవధికంగా కొనసాగుతుందన్నారు. రాత్రింబవళ్లు నిఘా వేసేందుకు ప్రత్యేకంగా ఒక ప్లాటూన్ పోలీసులను మోహరించారు. నిరసనల కారణంగా రోగుల సంరక్షణ ప్రభావితమైందని డీసీపీ జగ్మోహన్ మీనా విచారం వ్యక్తం చేశారు.

బొలంగా బాలిక పరిస్థితి విషమం

బొలొంగా బాధిత బాలిక ఆరోగ్య పరిస్థితి విషమించింది. ఉన్నత చికిత్స కోసం ఢిల్లీ ఎయిమ్స్‌కు విమానంలో తరలించారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఎయిర్ అంబులెన్స్‌లో ఢిల్లీకి తరలించినట్లు ఎయిమ్స్ డైరెక్టర్ అశుతోష్ బిశ్వాస్ తెలిపారు. ఢిల్లీ ఎయిమ్స్ నుంచి వచ్చిన వైద్య బృందంతో పాటు బాధిత బాలిక కుటుంబ సభ్యులు కూడా వెళ్లినట్లు తెలిపారు. ఆదివారం సాయంత్రం 4.20 గంటలకు ఆమెని ఆస్పత్రిలో చేర్చినట్లు అధికారికంగా ప్రకటించారు. ఆస్పత్రిలో చేరే సమయానికి బాధితురాలి శరీరం 75 శాతం వరకు కాలిపోయింది. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నందున ఆక్సిజన్ మద్దతుతో ఢిల్లీ ఎయిమ్స్ ఐసియూ బర్న్ యూనిట్, ప్లాస్టిక్ సర్జరీ బ్లాక్‌లో చికిత్స అందజేస్తున్నారు. ప్రత్యేక వైద్య బృందం ఆరోగ్య పరిస్థితిని ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తోంది.

ప్రభుత్వం సౌకర్యాలు కల్పిస్తాం: ముఖ్యమంత్రి

బొలొంగా బాధిత బాలిక చికిత్స కోసం ప్రభుత్వం సకల సదుపాయాలు కల్పిస్తుందని రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ప్రకటించారు. ఉత్తమ చికిత్స కోసం ఆమెను ఢిల్లీ ఎయిమ్స్‌కు విమానంలో తరలించారు. రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తుంది. బాలిక కోలుకుని త్వరలో తిరిగి రావాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు.

అదరగొట్టిన .. అంతరకుడ్డ కుర్రాడు



- ఏషియన్ వాలీబాల్ టోర్నీలో కాంస్య పతకం సాధించిన అట్టాడ చరణ్
- థాయ్‌లాండ్‌లో జరిగిన పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచిన భారత్
- అభినందించిన వాలీబాల్ సంఘ నాయకులు, క్రీడాకారులు



అదరగొట్టేలా వాలీబాల్ సర్వీస్ చేస్తున్న అట్టాడ చరణ్

శ్రీకాకుళం న్యూకాలనీ:

పలాస మండలం అంతరకుడ్డ గ్రామానికి చెందిన వాలీబాల్ కుర్రాడు అట్టాడ చరణ్ అదరగొట్టాడు. అంతర్జాతీయ పోటీల్లో ప్రాతినిధ్యం వహించిన మొదటి టోర్నీలోనే జట్టు విజయంలో కీలకపాత్ర పోషించి కాంస్య పతకం సాధించి శభాష్ అనిపించాడు. ఈ నెల 12 నుంచి 19వ తేదీ వరకు థాయిలాండ్ వేదికగా ప్రతిష్టాత్మక 2వ ఏషియన్ అండర్ -16(మెన్) వాలీబాల్ చాంపియన్‌షిప్ -2025 పోటీలు జరిగాయి. ఇందులో త్రుటిలో ఫైనల్ బెర్త్‌ను కోల్పోయిన భారత జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. భారత జట్టుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించిన సిక్కోలు క్రీడాతేజం చరణ్ కాంస్య పతకం సాధించాడు. జట్టు విజయంలో కీలకభూమిక వహించిన చరణ్ ప్రతిభను జట్టు యాజమాన్యం, ఇండియన్ వాలీబాల్ ఫెడరేషన్ ప్రశంసించింది. అంతకుముందు ఈ నెల 10వ తేదీ వరకు బెంగళూరు వేదికగా ఎన్.ఎస్.ఎస్.సి. అకాడమీలో జరిగిన శిక్షణా శిబిరాల్లో మంచి క్రమశిక్షణతోపాటు అత్యుత్తమ ఆటతీరుతో సెలక్టర్లను ఆకట్టుకున్నాడు.

అంతరకుడ్డ నుంచి అంతర్జాతీయ పోటీలకు..

చరణ్ తల్లిదండ్రులు అట్టాడ కమల్‌నాదమ్, దేవి. వీరిది వ్యవసాయ కుటుంబం. చరణ్ విశాఖపట్నంలోని అక్కయ్యపాలెంలో ఉన్న సాయ్ స్పోర్ట్స్ స్కూల్/హాస్టల్‌లో ఉంటూ పదో తరగతి పూర్తిచేశాడు. ఇంటర్మీడియెట్‌లో ప్రవేశం పొందనున్నాడు. అన్నయ్య భార్గవ్ ఇంజినీరింగ్ ఫస్టియర్ చదువుతున్నాడు. మావయ్య రవి ప్రేరణ.. కోచ్ సత్యనారాయణ ప్రోత్సాహంతో రాణించగలుగుతున్నానని చెబుతున్నాడు. 2025లో ఢిల్లీలో జరిగిన సీబీఎస్సీ నేషనల్స్ వాలీబాల్ స్కూల్‌గేమ్స్‌లో కాంస్య పతకం సాధించగా, గత ఏడాది 2024లో జార్ఖండ్‌లో జరిగిన సీబీఎస్సీ నేషనల్స్‌లో ప్రాతినిధ్యం వహించి సత్తాచాటాడు.

అభినందనల వెల్లువ..

సిక్కోలు నుంచి ఏషియన్ వాలీబాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహించడమే కాకుండా కాంస్య పతకం సాధించడం పట్ల క్రీడావర్గాల్లో సర్వాత్రా హర్షాతిరేకాలు వ్యక్తమౌతున్నాయి. వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ప్రత్యేకంగా మెచ్చుకున్నారు.వాలీబాల్ జిల్లా కార్యదర్శి కె.రామచంద్రుడు, ఉపాధ్యాక్షులు వై.పోలినాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శి ఎన్వీ రమణ, టి.రవి, సలహాదారు పి.సుందరరావు, పీఈటీ సంఘ నాయకులు ఎంవీ రమణ, ఎం.సాంబమూర్తి, బి.సతీష్, డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు, కోచ్ కె.హరికృష్ణ, వాలీబాల్ సంఘ ప్రతినిధులు, సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

సంతోషంగా ఉంది..

అంతర్జాతీయ ఏషియన్ వాలీబాల్ మీట్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించడం గర్వకారణంగా ఉంది. అందులోను మెడల్ సాధించడం సంతోషంగా ఉంది. సీనియర్ నేషనల్స్ ఆడి దేశానికి రిప్రజెంట్ చేయాలనేది నా కల. ఇందుకు అహర్నిశలు కృషి చేస్తా.

– అట్టాడ చరణ్, వాలీబాల్ క్రీడాకారుడు

బాలికలకు ఆర్థిక సాయం



బాలికల అమ్మమ్మకు నగదు అందిస్తున్న దాతలు

నరసన్నపేట: దేవాది కాలనీలో తల్లిదండ్రులను కోల్పోయిన బాలికలు మోహిని, యోగితలకు కంబకాయ గ్రామానికి చెందిన గుజ్జిడి కృష్ణారావు దంపతులు రూ.25,500 ఆర్థిక సహాయం ఆదివారం అందించారు. బాలికల చదువు, ఇతర ఖర్చులకు వినియోగించాలని బాలికల అమ్మమ్మ సాయమ్మను కోరారు. బాలికలు ఆరు నెలల వ్యవధిలో తల్లిదండ్రులను పోగొట్టుకున్నారు. తల్లి స్వాతి కాన్సర్ వ్యాధితో, తండ్రి కృష్ణ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే. బాలికలకు అండగా ఉంటామని వారి చదువుతో పాటు ఇతర అవసరాలు తీర్చేందుకు కృషి చేస్తామని కృష్ణారావు దంపతులు తెలిపారు. కాగా అలాగే మోహిని, యోగితలకు కోటబొమ్మాళి కేజీబీవీలో సీట్లు వచ్చాయి. ఇప్పటి వరకు మాకివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో చదువుతుండగా కోటబొమ్మాళి కేజీబీవీలో రెండు రోజుల క్రితం జాయిన్ అయ్యారు. గ్రామ పెద్దల కృషి తో వారికి కేజీబీవీలో సీటు వచ్చింది. కార్యక్రమంలో దాతలు సిర్నెల్లి రమణ, బొంగు సునీతలు, స్థానికులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనాలోచిత అధికారులను వదిలించుకోండి

• పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సూర్యనారాయణ


పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సూర్యనారాయణ

పార్వతీపురం రూరల్: విద్యాశాఖాధికారులు తీసుకున్న అనాలోచిత నిర్ణయాల వల్ల ప్రభుత్వం మాట పడాల్సి వస్తోందని, ఈ మేరకు మంత్రి వారిని వదిలించుకునే ప్రయత్నం చేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అమరాపు సూర్యనారాయణ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి తవిటినాయుడు, కాగాన విజయ్ సంబంధిత విద్యాశాఖామంత్రి లోకేష్‌కు హితవు పలికారు. ఆర్థికశాఖ అనుమతి తీసుకోకుండా ఉపాధ్యాయ పోస్టులను కొన్ని పాఠశాలలకు మంజూరు చేయకుండా బదిలీలు చేయడం వల్లే జీతాల చెల్లింపునకు సమస్య వచ్చిందన్నారు. ఇప్పటికీ కూడా విద్యాశాఖాధికారులు ఎప్పటిలోగా పొజిషన్ ఐడీలు కేటాయించి జీతాలు చేయగలరో వివరంగా చెప్పలేకపోతున్నారన్నారు. రెండు నెలలు కావస్తున్నా జీతాలు లేక కుటుంబ జీవన పరిస్థితి ఏవిధంగా నెట్టుకురాగలమని పీఆర్‌టీయూ తరఫున ప్రశ్నించారు. అనాలోచిత అధికారుల హడావిడి బదిలీలు చేసిన కారణంగానే ఈ పరిస్థితి దాపురించిందన్నారు. ఈ మేరకు మంత్రి లోకేష్ అనాలోచిత అధికారుల విధానాలను గుర్తించి దూరం పెట్టాలని ఏరికోరి ఎంచుకున్న శాఖకు మీరు ఎంచుకున్న అధికారుల వల్ల నష్టపోతున్నారన్న విషయాన్ని గ్రహించి ఆ దిశగా ఆలోచన చేయాలని కోరారు.

బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలు


క్షతగాత్రుడిని 108లో జిల్లా కేంద్రాస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని చిన మేరంగి నెయ్యిల వీధికి చెందిన సిద్ధాంతంనాగరాజు, సిద్ధాతం వెంకటేష్‌లు తమ బైక్‌పై ఆదివారం మధ్యాహ్నం 3.40 గంటల సమయంలో పెదమేరంగి కూడలికి వెళ్తుండగా పెద మేరంగి రామమందిరం మలుపువద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొనడంతో వారిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సహాయంతో చినమేరంగి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకురాగా డ్యూటీ డాక్టర్ ప్రభుతేజ చికిత్స అందించారు. నాగరాజు పరిస్థితి సీరియస్ కావడంతో 108 ద్వారా పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. చిన మేరంగి ఎస్సై పి.అనీష్ కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

ఆదివాసీలకు అండగా ఉంటాం

• రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు


వినతి పత్రం అందుకుంటున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

విజయనగరం అర్బన్: గిరిజన ప్రాంతంలోని ఆదివాసీలకు అండగా ఉంటామని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకర రావు అన్నారు. ఈ మేరకు పార్వతీపురం మన్యం జిల్లాలోని గిరిజన సమస్యలను రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు దృష్టికి సీపీఎం సీనియర్ నాయకుడు ఎం.కృష్ణమూర్తి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా చైర్మన్ క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేసి ఏజెన్సీలోని పలు సమస్యలను వివరించారు. కురుపాం నియోజకవర్గంతోపాటు ఇతర ఏజెన్సీ ప్రాంతాల్లో ఇప్పటికీ మౌలిక సదుపాయాలు కొరవడిన పరిస్థితులున్నాయని చెప్పారు. నాణ్యమైన విద్య, వైద్యం అందని పరిస్థితులున్నాయన్నారు. మారుమూల గిరిజన గ్రామాల ప్రజలు వైద్యసహాయం పొందేందుకు దూర ప్రాంతాలకు వెళ్లవలసి వస్తోందని రహదారి సౌకర్యం లేనందున ఇబ్బందులు పడుతున్నారని కృష్ణమూర్తి తెలిపారు. దీనిపై కమిషన్ చైర్మన్ స్పందిస్తూ ఏజెన్సీ ప్రాంతాల సమస్యలను తమ క్షేత్ర స్థాయి పర్యటనల్లో గుర్తించి ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తున్నట్లు తెలిపారు. సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని డాక్టర్ శంకర రావు ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు కృష్ణమూర్తికి చెప్పారు.




శ్రావణం.. శుభప్రదం

పాలకొండ కోటదుర్గ ఆలయంలో వరలక్ష్మీ వ్రతాలు చేస్తున్న మహిళలు(ఫైల్) ఇన్‌సెట్లో, శ్రావణలక్ష్మిగా ముస్తాబైన వీరఘట్టం శ్రీ కోటదుర్గతల్లి (ఫైల్)

- ఈనెల 25 నుంచి ప్రారంభం
- ఆగస్టు 3న స్నేహితుల దినోత్సవం
- 8న వరలక్ష్మీ వ్రతం
- 9న రాఖీ పండగ
- 16న శ్రీకృష్ణ జన్మాష్టమి
- పూజలకు సిద్ధమవుతున్న మహిళలు


కోటదుర్గ ఆలయంలో కుంకుమ పూజలు జరిపించేందుకు సిద్ధం చేసిన మంటపం

వీరఘట్టం: సకల శుభాల శ్రావణ మాసం ఈ నెల 25న ఆరంభం కానుంది. శ్రావణ మాసంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు, పవిత్రోత్సవాలు, కృష్ణాష్టమి వేడుకల నేపథ్యంలో ఆలయాల్లో భక్తుల సౌలభ్యం కోసం ఆలయ నిర్వహణ కమిటీలు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నాయి. ఈ మాసంలో ఇంటింటా శ్రావణ శోభ కనిపిస్తుంది. అయితే ఈ మాసంలో వచ్చే ప్రతి శుక్రవారానికి ఓ విశిష్టత ఉంది, అందుచేత మహిళలు ఈరోజును ఎంతో పవిత్రమైన దినంగా భావిస్తారు. నెల రోజులుగా ఆషాఢం కావడంతో ముహూర్తాలు లేవు.ఈనెల 25 నుంచి శ్రావణ మాసం ప్రారంభం కానుండడంతో మహిళలు శ్రావణ లక్ష్మీ వ్రతాలను ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో చేసేందుకు సిద్ధమవుతున్నారు.ఈనెల 26న మొదటి శుక్రవారం కావడంతో తమ ఇళ్లల్లో, ఆలయాల్లో శ్రావణ లక్ష్మికి పూజలు చేసేందుకు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు.

నోముల మాసం శ్రావణం..

పురోహితులు శ్రావణ మాసాన్ని నోముల మాసంగా అభివర్ణిస్తారు. శ్రావణంలో మంగళగౌరీ వ్రతం, వరలక్ష్మీ వ్రతాలను ఆచరిస్తారు. మంగళగౌరీ వ్రతాన్ని శ్రావణంలో వచ్చే ఏ మంగళవారమైనా చేయవచ్చు. ఈ వ్రతాన్ని యువతులు పెళ్లైన ఏడాది తరువాత ఆచరిస్తారు. వరలక్ష్మీ వ్రతాన్ని పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం రోజు జరుపుకుంటారు.ఈ వ్రతాన్ని జీవితాంతం ఆచరిస్తారు.

ఈ నెల 28 నుంచి మంచి ముహూర్తాలు..

నెల రోజులుగా ఉన్న ఆషాఢ మాసం ఈనెల 22తో ముగియనుంది. ఈనెల 25 నుంచి శ్రావణ మాసం ప్రారంభం కానుంది. దీంతో ఈనెల 28 నుంచి ఆగస్టు 22 వరకు మంచి ముహూర్తాలు ఉన్నాయి. శ్రావణ మాసంలో వ్రతాలతో పాటు పెళ్లిళ్లు, గృహప్రవేశాలు, శుభాకార్యాలకు మంచి రోజులు కావడంతో శుభకార్యాలు చేపట్టేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా జూలై 26,27,30,31ఆగస్టు నెలలో1,3,4,6, 7, 8, 9, 10, 11, 13,14,17,18 తేదీలో పెళ్లి ముహూర్తాలు ఉన్నాయి. శ్రావణమాసంలో ఉన్న 17 మంచి ముహూర్తాల్లో జిల్లాలో వందల సంఖ్యలో పెళ్లిళ్లు జరగనున్నాయని పురోహితులు చెబుతున్నారు.

ముఖ్యమైన పండగలు..

శ్రావణ మాసమంతా పండగల సందడి ఉంటుంది.ఈ నెల 26న తొలి శుక్రవారం, ఆగస్టు 1న రెండవ శుక్రవారం, ఆగస్టు 3న ఆదివారం స్నేహితుల దినోత్సవం, ఆగస్టు 8న మూడో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం, ఆగస్టు 9న రాఖీ పండగ, అదే రోజు జంధ్యాల పౌర్ణమి, ఆగస్టు 15న నాల్గవ శుక్రవారం , ఆగస్టు 16న శ్రీకృష్ణ జన్మాష్టమి వంటి ముఖ్యమైన పండగలు శ్రావణంలో ఉన్నాయి. ఆగస్టు 22న ఐదవ శుక్రవారంతో శ్రావణ మాసం ముగుస్తుంది.శ్రావణం పూర్తయిన వెంటనే భాద్రపదం మాసం ఈ ఏడాది ఆగస్టు 27న జరగనున్న వినాయకచవితితో ప్రారంభంకానుంది.

శ్రావణమాసానికి అత్యంత ప్రాధాన్యం




సకల శుభాలను ఒసగే శ్రావణం జ్ఞానస్థితిని అందిస్తుంది. హరిహర భేదం లేదని నిరూపించే శ్రావణమాసంలో వైష్ణవారాధనతో పాటు మహాశివుడికి పెద్ద ఎత్తున రుద్రాభిషేకాలు నిర్వహిస్తారు.ముఖ్యంగా వివాహాది శుభకార్యాలకు శ్రావణ మాసంలో మంచి ముహూర్తాలు ఉన్నాయి.

ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ, యజ్ఞకర్త, వీరఘట్టం

ఆడలికి తగ్గుతున్న ఆదరణ


వెలవెలబోయిన ఆడలి వ్యూపాయింట్



కొద్ది నెలల కిందట పర్యాటకులతో కళకళలాడుతున్న ఆడలి వ్యూపాయింట్

- టూరిస్టులు లేక వ్యూపాయింట్ వెలవెల
- ప్రమాదాలే కారణమా?

సీతంపేట: సీతంపేట ఏజెన్సీలో అత్యంత ప్రాచుర్యం పొందిన ఆడలి వ్యూపాయింట్ పర్యాటక ప్రాంతం పర్యాటకులు లేక వెలవెలబోతోంది. సుమారు రూ.2 కోట్ల వ్యయంతో ఇక్కడ వ్యూపాయింట్ నిర్మించారు. ఏడాది కిందట పర్యాటక దినోత్సవం రోజున వ్యూ పాయింట్ ఇక్కడ ప్రారంభమైంది. ఒకప్పుడు వందల సంఖ్యలో టూరిస్టులు ప్రతిరోజూ వచ్చి ఇక్కడి అందాలను వీక్షించి వెళ్లేవారు. ఇప్పుడు రోజులో కనీసం 20 మంది కూడా వస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. ఆదివారం సెలవు రోజున కూడా రావడానికి ఎవరూ ఆసక్తి చూపించక పోవడం గమనార్హం. దీనికి ప్రధాన కారణం ఆడలి వ్యూపాయింట్‌కు వెళ్లే రహదారిలో ప్రమాదాలు సంభవించడమేనని పలువురు చెబుతున్నారు. ఆడలి వ్యూపాయింట్ ఏర్పాటైన తరువాత మలుపుల వద్ద జరిగిన ప్రమాదాల్లో నలుగురు చనిపోయారు. అలాగే ఆటోలు, టూవీలర్లు, మ్యాక్సీక్యాబ్‌లు వంటివి ఘాట్‌రోడ్డులోని మలుపుల వద్ద తిరగబడిపోయి పదుల సంఖ్యలో పర్యాటకులు గాయాలపాలైన వారు ఉన్నారు. ఇక్కడికి వెళ్తే ప్రమాదాలు జరుగు తున్నాయన్న భావన టూరిస్టుల్లో కలగడంతో వ్యూపాయింట్ వెలవెలబోతున్నట్లు తెలుస్తోంది.

నిర్మాణంలో రక్షణగోడ..

ఆడలి వ్యూపాయింట్‌కు వెళ్లే మార్గంలో పలు మలుపుల వద్ద రక్షణగోడలు ఏర్పాటు చేస్తున్నారు. అక్కడక్కడ హెచ్చరిక బోర్డులు సైతం పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. రక్షణగోడలు పూర్తయితే పర్యాటకుల రద్దీ పెరిగే అవకాశం ఉందని టూరిజం శాఖ భావిస్తోంది. ఒకప్పుడు కనువిందు చేసిన ఆడలి వ్యూపాయింట్ ఇప్పుడు వెలవెలబోతుండడం గమనార్హం.



నిర్మాణంలో ఉన్న రక్షణగోడ


ఎమ్మెల్సీ పెనుమత్సకు అభినందనల వెల్లువ


ఎమ్మెల్సీ సురేష్‌బాబును సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ తదితరులు

నెల్లిమర్ల రూరల్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శిగా ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సూర్యనారాయణరాజు(సురేష్‌బాబు) నియమితులు కాగా ఆయనకు పార్టీ శ్రేణుల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మొయిద గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ గదల సన్యాసినాయుడు, నగరపంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావులు పెనుమత్సను సత్కరించి, అభినందనలు తెలిపారు. తనపై ఎంతో నమ్మకం ఉంచి ఈ పదవి కట్టబెట్టిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలని, మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ, ఇతర నాయకుల సమన్వయంతో పార్టీ మరింత బలోపేతానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేత మత్స సత్యన్నారాయణ, వైస్ ఎంపీపీ సారిక వైకుంఠం నాయుడు, నాయకులు పెనుమత్స సంతోష్, రేగాన శ్రీనివాసరావు, జమ్ము అప్పలనాయుడు, గేదెల రామచిరంజీవి, తర్లాడ దుర్గారావు, అంబళ్ల కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తుల విక్రయాలపై ప్రత్యేక డ్రైవ్

- డ్రోన్స్‌తో దాడులు
- ఒకే రోజు 255 ఓడీ, 53 కోప్టా కేసుల నమోదు
- మందుబాబులకు కౌన్సెలింగ్


పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: జిల్లాలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతూ ప్రజాశాంతికి భంగం కలిగించినా, విద్యాసంస్థలకు వంద మీటర్ల పరిధిలో సిగరెట్స్, ఇతర పొగాకు ఉత్పత్తులు విక్రయించినా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందల్ హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లుగా తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి, న్యూసెన్స్ చేస్తూ, ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై దాడులు చేయాలని సిబ్బందిని ఎస్పీ ఆదేశించారు. అలాగే వారిపై కేసులు నమోదు చేయాలని, పట్టుబడిన మైనర్లు, మందుబాబులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని ఎస్పీ వకుల్ జిందల్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా సంబంధిత పోలీసు అధికారులు, సిబ్బంది విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా లేఅవుట్లు, గ్రామ శివారు ప్రాంతాల్లోను, నగర శివారు ప్రాంతాల్లోను, బహిరంగంగా మద్యం తాగిన వారిపై పోలీసు అధికారులు, సిబ్బంది డ్రోన్స్ తో దాడులు నిర్వహించారు. ఇక విద్యాసంస్థలకు 100మీటర్ల పరిధిలో పొగాకు ఉత్పత్తుల విక్రయాలు చేసే కిరాణా, పాన్ షాపు వ్యాపారులపై కూడా దాడులు నిర్వహించారు. నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారులపై కోప్టా చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి, జరిమానా విధించామని ఎస్పీ తెలిపారు. ఆదివారం ఒక్కరోజునే 255 కేసులు నమోదు చేశామని పొగాకు ఉత్పత్తులు విక్రయించిన వారిపై 53 కేసులు నమోదు చేసి, జరిమానాగా రూ.8,500 విధించామని ఎస్పీ వకుల్ జిందల్ వివరించారు.

పారా సబ్ జూనియర్స్, జూనియర్స్ అథ్లెట్స్ ఎంపిక


అథ్లెటిక్స్‌లో తలపడుతున్న క్రీడాకారులు

విజయనగరం: పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాజీవ్ క్రీడా మైదానంలో పారా జూనియర్, సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు ఆదివారం ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన పారా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వి.రామస్వామి జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి విజయనగరం జిల్లాలో 13 ఏళ్ల నుంచి 18 ఏళ్ల లోపు పారా క్రీడాకారులు వందమందికి పైగా ఈ పోటీల్లో పాల్గొనడం శుభపరిణామమన్నారు. ప్రధానంగా రన్నింగ్, షాట్ పుట్, లాంగ్ జంప్, హై జంప్, డిస్కస్ త్రో, జావెలిన్ త్రో పోటీలు నిర్వహించామని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నామని, అందులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఆగస్టులో హర్యానాలో జరగనున్న జాతీయ స్థాయి పారా జూనియర్, సబ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్–2025 కోసం ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.దయానంద్, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు తురెళ్ల రాము, మన్యం జిల్లా అధ్యక్షుడు చీమల రాంబాబు, ఇంటర్నేషనల్ మెడలిస్ట్ శివగంగ, పారా నేషనల్ స్విమ్మర్ రవి తదితరులు పాల్గొన్నారు.

పాపం..పసివాడు

- గుండె జబ్బుతో బాధపడుతున్న చిన్నారి
- ఆదుకోని ఆరోగ్యశ్రీ
- వైద్యం కోసం డబ్బు లేక తల్లిదండ్రుల విలవిల
- ఆపన్నహస్తం కోసం ఆత్రంగా ఎదురుచూపులు


గుండె జబ్బుతో బాధపడుతున్న బాలుడు నిషాంత్


నిషాంత్‌తో తల్లి అరుణలత

రేగిడి: ముక్కుపచ్చలారని పసికందు. బోసినవ్వులతో అమ్మ ఒడిలో లాలన..ఆలనతో గడిచిపోవలసిన పసిప్రాణం. బాల్యంలోనే మాయదారి రోగం ఆవహించింది. నిరుపేద కుటుంబంలో ఉన్న తల్లిదండ్రులు కూలిపనులు చేస్తే తప్ప పూటగడవని పరిస్థితి. మరోపక్క బాలుడికి ఆపరేషన్ చేయకపోతే ప్రాణభయం ఉందని వైద్యులు చెబుతున్నారు. అంపశయ్యపై ఆ బాలుడు కాలం వెళ్లదీస్తుంటే..ఆర్థిక స్థోమత లేక నిస్సహాయ స్థితిలో తల్లిదండ్రులు విలవిలలాడిపోతు న్నారు. ఇటువంటి తరుణంలో ఆ పసికందు ప్రాణం నిలబెట్టాలంటే మనసున్న వారంతా ఆపన్నహస్తం అందించాలి. వైద్యం ఖర్చుల కోసం ఆర్థిక సహాయం అందించాలని తల్లిదండ్రులు ప్రాథేయ పడుతున్నారు. ఇది విజయనగరం జిల్లా రేగిడి మండలం వన్నలి గ్రామానికి చెందిన నాలుగు నెలల బాలుడు బోనెల నిషాంత్ తల్లిదండ్రులు బోనెల రాము, అరుణలత దీనగాథ.

గ్రామానికి చెందిన బోనెల రాము, అరుణలతకు నాలుగు నెలల క్రితం నిషాంత్ జన్మించాడు. పుట్టిన కొద్దిరోజుల వరకు ఆరోగ్యంగా ఉండేవాడు. క్రమేణా పసికందు ఆరోగ్యం క్షీణిస్తుండడంతో తల్లిదండ్రులు తెలుసుకుని ఆస్పత్రులకు తీసుకువెళ్లారు. వైద్యులు తనిఖీల అనంతరం బాలుడికి గుండె సంబంధిత వ్యాధి ఉన్నట్లు నిర్ధారించారు. ఆపరేషన్ చేయాలంటే రూ.6లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెబుతున్నారని బాలుడి తల్లిదండ్రులు వాపోతున్నారు. సహజంగా ప్రతి మనిషికి గుండె ఎడమ భాగంలో ఉంటుంది. కానీ ఈ బాలుడికి గుండె కుడి వైపు ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. రాజాం, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ప్రాంతాల్లోని ఆస్పత్రులకు పసివాడిని తిప్పారు. ఇంట్లో ఆర్థిక స్థోమత లేకపోయినా అప్పులు చేసి పిల్లాడిని ఆస్పత్రుల చుట్టూ తిప్పారు. ఇన్ని లక్షలు పెట్టి బాలుడికి వైద్యం చేయలేని పరిస్థితిలో తాము ఉన్నామని రోదిస్తున్నారు.

ఆదుకోని ఆరోగ్య శ్రీ..

ఆరోగ్యశ్రీ పథకం ఆ పసికందును ఆదుకోవడం లేదు. ఎన్టీఆర్ భరోసా ద్వారా తమ కుమారుడిని రక్షించాలని పలుమార్లు వేడుకున్నప్పటికీ ఆస్పత్రుల్లో ఈ వ్యాధికి ఆరోగ్య శ్రీ వర్తించదని చెబుతున్నారన్నారు. దీంతో ఏమీ చేయలేని ఆ కుటుంబం పిల వాడిని చేతిలో ఉంచుకుని బేలచూపులు చూస్తోంది.

మానవతా వాదుల కోసం..

నిరుపేద తల్లిదండ్రులు దాతల నుంచి సహాయం కోరుతున్నారు. నిషాంత్ వైద్యం కోసం సహాయం అందించాలనుకునే మానవతా వాదులు ఫోన్ ఫే నం.7036780839కు ఆర్థికసహాయం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రాజన్న బతికుంటే రైతులకీ పాట్లు ఉండేవా?


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట: దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి బతికిఉంటే జిందాల్ నిర్వాసిత రైతులకు ఈ పాట్లు ఉండేవి కాదని ఎమ్మెల్సీ రఘురాజు తన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిందాల్ నిర్వాసితుల అగచాట్లు, ప్రభుత్వం వైఖరి, పోలీసుల తీరు, అధికారుల నిర్లక్ష్య వైఖరిపై స్పందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వాన్ని నడుపుతున్నది కూటమి సర్కారా? లేక జిందాల్ యాజమాన్యమా? అన్న సందేహం కలుగుతోందన్నారు. రెవెన్యూ, పోలీస్ యంత్రాంగాన్ని జిందాల్ భూములకు కాపలా కాయాలంటూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందా? లేక కార్పొరేట్ల సేవలో యంత్రాంగం తరిస్తోందా? అని ప్రశ్నించారు. జిందాల్ భూముల వద్దకు రైతులు వెళ్లకుండా, నిర్వాసితులు రోడ్డు ఎక్కకుండా కాపలా కాయడం, కేసులు పెట్టడం సిగ్గుచేటన్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులకు ప్రభుత్వం వేతనాలు ఇస్తోందా? లేక జిందాల్ దగ్గర ఉద్యోగాలు చేస్తున్నారో ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. దివంగత రాజశేఖర్ రెడ్డి హయాంలోనే జిందాల్‌కు భూములు కేటాయించారని, నేడు వైఎస్ఆర్ ఉండి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదన్నారు. నిర్వాసితులకు జిందాల్ అన్నీ ఇచ్చేసిందని మంత్రులు, కలెక్టర్ అంతా జిందాల్ ఇచ్చిన నోట్‌నే పదే పదే చదువుతారు తప్ప ఎస్‌కోట వచ్చి ప్రెస్‌మీట్ ఎందుకు పెట్టరు? ధైర్యంగా రైతుల ముందుకు ఎందుకురారని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే లలితకుమారి స్పందిస్తారని ఆశించినా ఆమె ఏ ఒత్తిళ్ల వల్ల మాట్లాడడం లేదో తెలియడం లేదన్నారు.

డివైడర్ ఢీకొని వ్యక్తి మృతి


దామోదరరావు మృతదేహం

పూసపాటిరేగ : మండలంలోని కోనాడ జంక్షన్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్ బైక్‌పై వెళ్తున్న వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన వివరాల్లోకి వెళ్తే డెంకాడ మండలం దొడ్డిబాడవ గ్రామానికి చెందిన డోల దామోదరరావు (27) మోటార్ సైకిల్‌పై సర్వీసురోడ్డులో నాతవలస వైపు వెళ్తుండగా కోనాడ జంక్షన్ సమీపంలో డివైడర్‌ను ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట ఆస్పత్రికి పోలీసులు తరలించారు. ఈ మేరకు పూసపాటిరేగ ఎస్సై ఐ.దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

• అమ్మవారికి ఆషాఢం సారె



విజయనగరంలోని పెద్దచెరువు ఉత్తర గట్టుపై ఉన్న శ్రీవిజయసాగర దుర్గామల్లేశ్వరమ్మ వారికి ఆషాఢం సారెను ఆదివారం సమర్పించారు. హెల్పింగ్ హ్యాండ్స్ హిజ్రాస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అమ్మవారికి భక్తులు ఉదయం పసుపు, కుంకుమలు అందజేసి, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఏడు ఎడ్ల బండ్లపై కొబ్బరి బొండాలు, వివిధ రకాల స్వీట్లు, పండ్లు, పూలతో కోట వద్ద నుంచి ర్యాలీగా వెళ్తూ సారెను ఊరేగించారు. బాజాభజంత్రీలు, మేళతాళాలు, విచిత్ర వేషధారణల ప్రదర్శన నడుమ సాగిన ఈ కార్యక్రమం అందరిలో ఆధ్యాత్మిక భావం పెంపొందించింది. భక్తులు అమ్మవారికి ఘటాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపకుడు కొండబాబు, ప్రతినిధులు మీనమ్మ, స్రవంతి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

– విజయనగరం టౌన్